క్లుప్తంగా

అశ్రద్ధ తగదు..

వీరఘట్టం: అనారోగ్యంతో బాధపడేవారు అశ్రద్ధ చేయకుండా వైద్యసేవలు పొందాలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బి. ప్రదీప్ తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

వీరఘట్టం: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. పర్యావరణానికి ముప్పు కలిగించే నిషేధిత పాలిథిన్ ఉత్పత్తులను వినియోగించవద్దని వ్యాపారులు, ప్రజలకు సూచించారు. వారం రోజుల్లో పాలిథిన్ విక్రయాలను నిలిపివేయాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓ బి.కోటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

పాలకొండ రూరల్: సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.సూర్యకుమారి అన్నారు. శాఖాపరమైన తనిఖీల్లో భాగంగా శనివారం సీతంపేట మండలం బోయన్నగూడలో దాడులు చేపట్టారు. ఇదే ప్రాంతానికి చెందిన సవర చంద్రరావు వద్ద పది లీటర్ల సారాతో పాటు సారా తయారీకి సిద్ధం చేసిన 13 వందల లీటర్ల బెల్లం ఊటలు లభించగా.. వాటిని స్వాధీన పరుచుకున్నట్లు సీఐ తెలిపారు. మరో వ్యక్తి ఎస్.మంగయ్య వద్ద పది లీటర్ల సారా పట్టుబడిందన్నారు. నిందితులతో పాటు బెల్లం సమకూర్చిన బూర్ల కృష్ణ, కళ్లేపల్లి క్రిష్ణలపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు చెప్పారు.

అభ్యంతరాలు తెలియజేయండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి

పాలకొండ: పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి అభ్యంతరాలున్నా తెలియజేయాలని తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ కేంద్రానికి గరిష్ఠంగా 1200 మంది ఓటర్లుగా ఉండేటట్లు ఆదేశాలున్నాయన్నారు. భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్పు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు శనివారం పోటెత్తారు. విశేష పూజలు చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

'న్యాయ సలహా సమావేశం'

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బొమ్మిక గ్రామంలో మండల న్యాయసేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ సలహా సమావేశం శనివారం నిర్వహించారు. రెండో అదనపు జడ్జి ఎస్.దామోదరరావు మాట్లాడుతూ ప్రతి ఇంటివారు ఆర్థికంగా బలపడి, మెరుగైన జీవనం సాగించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఇంటి యజమాని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, కుటుంబాన్ని పెంచి పోషించుకునే స్థితిలో ఉండాలన్నారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగుపరచాలి

గరుగుబిల్లి: విద్యార్థుల అభ్యసన స్థాయిలు మెరుగుపరచాలని ఎంఈవో1 ఎస్.సింహాచలం ఆదేశించారు. మండలంలోని గొల్లవానివలస, కేఆర్ఎస్ వలస గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వివిధ ప్రశ్నలు అడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేయాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం బి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

బోధన పద్ధతులపై అవగాహన

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురం, చినమేరంగి, పెదమేరంగి, జియ్యమ్మవలస, పెదబుడ్డిడి క్లస్టర్ల పరిధిలోని ఉపాధ్యాయులకు బోధన పద్ధతులపై శనివారం అవగాహన కల్పించారు. బోధన నైపుణ్యాలు ఏ విధంగా మెరుగుపరుచుకోవాలి.. ఏ పాఠం ఏ పద్ధతిలో చెబితే విద్యార్థి అవగాహన చేసుకుంటాడన్న విషయాలను ప్రధానోపాధ్యాయుడు కేఏఎస్ కుమార్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు పాఠశాలల్లో అడ్మిషన్లకు అవకాశం ఉందని, ఉపాధ్యాయులకు ఫేషియల్ హాజరు తప్పనిసరని, ప్రతి ఉపాధ్యాయుడూ ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు.

ఇదేనా స్వచ్ఛాంధ్ర..?

- ఓ వైపు వర్షాలు.. మరోవైపు పేరుకుపోతున్న వ్యర్థాలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



శివారు వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ రూరల్:

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ నగర పంచాయతీల్లో స్థానం సంపాదించిన పాలకొండ ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో వెనుకబడుతోంది. కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర పేరిట చేస్తున్న హడావిడికి సంబంధించిన ఫలితాలు క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. ప్రజలపై ప్రస్తుత ప్రభుత్వం పన్నుల భారం 10 శాతం పెంచి వసూళ్లు చేపడుతోంది. పట్టణ పరిధిలో రూ.2 కోట్ల మేర వివిధ రకాల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా.. పెరిగిన శాతంతో ఈ మొత్తంపై మరో 20 లక్షల రూపాయల అదనపు భారం ప్రజలపై పడింది. అయితే చెల్లిస్తున్న పనులకు సరిపడా ప్రయోజనాలు కానరావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం వస్తే స్థానికులు హడలిపోతుంటారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారాలే వెక్కిరిస్తుంటాయి. దీనికి తోడు మున్సిపల్ కార్మికుల్లో ఓ విభాగం వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పట్టారు. పనులు చేయించే విషయంలో కార్మికుల సంఖ్య సద్దుబాటు కాకపోవటంతో రోజువారీ విధుల్లో కాలయాపన చోటు చేసుకుంటోంది. ఆ ప్రభావం ప్రజా ఆరోగ్యంపై పడుతోంది.



చిన్నపాటి వర్షాలకు కస్పావీధిలో దుస్థితిలా..



పాడైన చెత్త తరలింపు వాహనాలు

20 వార్డుల్లో..

10.74 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న పాలకొండ నగర పంచాయతీ పరిధిలో గల 20 వార్డుల్లో 180కి పైగా వీధులున్నాయి. 40 వేల పైచిలుకు ప్రజలు 10 వేల ఆవాసాల్లో నివశిస్తున్నారు. వీరికి మెరుగైన పారిశుధ్య, ఇతర సేవలు అందించేందుకు 250 ఇళ్లను ఒక మైక్రో పాయింట్‌గా విడదీసి అందుకు తగ్గ పారిశుధ్య కార్మికులను నియమించాల్సి ఉంది. ఈ లెక్కన పట్టణ ప్రజల అవసరాలకు తగ్గట్టు 120 మంది కార్మికుల అవసరం ఉండగా ప్రస్తుతం 46 మంది మాత్రమే పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్నారు. వీరిపై పనిభారం పెరగడంతో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోయింది.

రోడ్లపైనే చెత్త కుప్పలుగా..

వీధి కూడళ్ల వద్ద పేరకుపోతున్న చెత్తను తరలించేందుకు పుష్‌కార్ట్ (చెత్త తరలింపు వాహనాలు) కొరత వేధిస్తోంది. అలాగే కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు కూడా అవశాన దశకు చేరుకున్నాయి. దీంతో రోడ్లపై చెత్త కుప్పలు రోజుల తరబడి నిల్వ ఉండిపోతున్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది అంటు రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు సమకూర్చుకున్న ఫాగింగ్ యంత్రాల వినియోగం కూడా కానరావడం లేదు. కాలువల్లో బ్లీచింగ్ చల్లడం దాదాపుగా విస్మరించారు.

శానిటేషన్‌పై దృష్టి సారించాలి..



పట్టణంలో పారిశుధ్య సమస్య దారుణంగా ఉంది. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోంది. వీధి కూడళ్ల వద్ద రోజుల తరబడి చెత్త నిల్వ ఉండిపోతోంది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం పడితే చాలు మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలి. పట్టణ ప్రజలకు తగ్గట్టు పారిశుధ్య కార్మికులను, వాహనాలను సమకూర్చాలి.

– టి.రామకృష్ణ, నగర పంచాయతీ, పాలకొండ

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పక్కనే పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

- వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పిలుపునిచ్చారు. మండలంలోని చినమేరంగి కోటలో పార్టీ గరుగుబిల్లి, కురుపాం మండలాల విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వారు..పార్టీ మరింత బలోపేతానికి, ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయడంపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, అంతా దోపిడీ పాలనే కొనసాగుతోందన్నారు. అధికార పార్టీ అవినీతి ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరాయని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు చీదరించుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. మరోసారి కూటమిని నమ్మే పరిస్థితి లేదని, రేపు భవిష్యత్ మనదేనన్నారు. కూటమి అసమర్థ పాలనకు ప్రజలంతా చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు.

కార్యక్రమంలో గరుగుబిల్లి, కురుపాం మండలాల పార్టీ కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పాలకొండ రూరల్ : పట్టణ పరిధిలోని 3వ వార్డు ఎన్‌కే.రాజుపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొగాన శంకరరావు కుటుంబాన్ని మాజీ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. శంకరరావు తల్లి రామలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శంకరరావును పరామర్శించి ఓదార్చారు. అలాగే ఇదే ప్రాంతానికి చెందిన మరో కార్యకర్త నీలాపు దుర్గారావు మృతి చెందగా.. వారి ఇంటికెళ్లి మృతుడి భార్య వనజాక్షిని ఓదార్చారు. ఆమె వెంట కౌన్సిలర్ నీలాపు శ్రీనివాసరావు, పార్టీ పాలకొండ పట్టణ కార్యదర్శి మిడితాన సూర్యనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు జడ్డు జోగినాయుడు, నల్లి సింహాచలం, మిగితాన రాము, వెన్నపు అప్పారావు, లక్ష్మం, నీలాపు రామారావు, శంకరరావు, ఎస్.అప్పలనాయుడు తదితరులున్నారు.



శంకరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ శాసన సభ్యురాలు కళావతి, తదితరులు

నేడు వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం

వీరఘట్టం: 'బాబు ష్యూరిటీ – గ్యారెంటీ'పై ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక కోదండరామా కల్యాణ మంటపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దమలపాటి వెంకటరమణనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్య లో హాజరై, విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వినూత్న నిరసన..



వేపాకు తింటూ నిరసన తెలియజేస్తున్న కార్మికులు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం ఏడో రోజుకు చేరుకుంది. అధికారుల నుంచి స్పందన కొరవడడంతో వీరు వేపాకులు తింటూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని..పైగా చర్చల పేరిట కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం తమకొచ్చే అరకొర జీతాలతో కుటుంబాలను నెట్టుకురాలేకపోతున్నామని వాపోయారు. కార్మిక శాఖా మంత్రి స్పందించి జీతాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు, పడాల సాయి, హరిబాబు, వెంకటరమణ, మహేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

జియ్యమ్మవలస రూరల్: ఎరువుల కొరత లేకుండా చూడాలని సీపీఎం నాయకుడు కూరంగి సీతారాం కోరారు. మండలంలోని దంగబద్ర సచివాలయం వద్ద రైతులతో కలిసి శనివారం నిరసనకు దిగిన ఆయన..రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఇప్పటికే నారు మళ్లకు అవసరమైన ఎరువులు అందకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయంపై సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించండి



సీతంపేట: ఐటీడీఏలో ప్రతిజ్ఞ చేస్తున్న పీఓ, తదితరులు

సీతంపేట: పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించాలని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. పాలిథిన్, ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తామంటూ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి జి. చిన్నబాబు ఆధ్వర్యంలో ఎంపీడీఓ మిశ్రో, తదితరులు దుకాణాలకు వెళ్లి పాలిథిన్ ఉత్పత్తులను విక్రయించకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, పీహెచ్ఓ ఎస్‌పీ గణేష్, ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, ఈఓపీఆర్‌డీ సత్యం పాల్గొన్నారు.

పక్కాగా పాలిథిన్ నిషేధం..

పాలకొండ: నగర పంచాయతీలో పాలిథిన్ నిషేధం పక్కాగా అమలు చేయాలని ప్రత్యేక అధికారి వైకుంటరావు ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలన్నారు. కమిషనర్ రతన్‌రాజు మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: నిషేధిత పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ వస్తువులు వినియోగించవద్దని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగించొద్దని పిలుపునిస్తూ మానవహారం చేపట్టారు. అనంతరం జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే.. ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలు పాటించి, ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తహసీల్దారు ఎస్.శేఖర్, ఎంఈవో బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, అధికారులు

గరుగుబిల్లి: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు కోరారు. మండలంలోని గరుగుబిల్లి, ఉల్లిబద్ర, గొట్టివలస గ్రామాల్లో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎంపీడీవో పైడితల్లి, మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తదితరులు కలిసి నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఇందుమతి, డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జగన్మోహనరావు కోరారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రజాప్రతినిధులు సభలో లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరించాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తొలుత మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు నాయకులు పలు సమస్యలను లేవదీసి వాటిని పరిష్కరించాలని కోరారు. సవర భాష వలంటీర్లకు గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సవర భాష వలంటీర్ల మాదిరి జాతాపు వలంటీర్లను కూడా గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలని చెముడుగూడ ఎంపీటీసీ సభ్యుడు ఎం.రమణ అడిగారు. భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కేవలం ఎనిమిది బాత్‌రూమ్‌లే ఉండడంతో అక్కడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటల నిర్వహణపై కొంతమంది వ్యక్తులు రాజకీయ పెత్తనం చెలాయిస్తున్నారన్న సమస్య లను సర్పంచ్ బి.గౌరీశంకరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల్లేవ్!

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయిస్తుంటే నెగిటివ్ అని వస్తోందని, అదే పేషెంట్‌కు మళ్లీ ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్ష చేస్తే పాజిటివ్ అని వస్తోందని, మలేరియా నివారణ మందులు కూడా పీహెచ్‌సీ వద్ద ఉండడం లేదని, ఉపాధి హామీ పథకం వేతనాలు గత 8 వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ఉపాధి పనులను సీహెచ్‌డబ్ల్యూలకు కూడా కల్పించాలని కొండవాడ సర్పంచ్ ఎం.కృష్ణారావు కోరారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లను గిరిజన ప్రాంతాల్లో రద్దు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఇన్‌పేషెంట్లకు మూడు పూటలా భోజనం అందివ్వాలని, పీసా చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఇళ్ల నిర్మాణ బిల్లులను రూ.5 లక్షలకు పెంచాలని సభ్యులంతా తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా, ఎంఈవో బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పి.ఆమిటి, బొద్దిడి, దుమ్మంగి గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలను యాజమన్యం ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అంగీకరించడంతో ఆ పాఠశాలలను ఈ నెలలో పునఃప్రారంభించనున్నట్లు చెప్పారు. వ్యవసాయాధికారి పి.శంకరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం చెల్లించిన మాదిరిగా పంటల బీమా సొమ్మును ఈ ప్రభుత్వం చెల్లించడం లేదని, వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం ఎంపీపీ దీనమయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లలో కొందరు తమ పనులు మాని గ్రామాల్లో రాజకీయ కార్యాకలాపాలు నిర్వహిస్తున్నారని, అటువంటివి మానుకోకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, ఎంపీడీవో పి.త్రివిక్రమరావు, తహసీల్దారు ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లను నిర్మూలించాలి

సీతంపేట: డ్రాపౌట్లను నిర్మూలిచాలని జీసీడీఓ రాములమ్మ సూచించారు. శనివారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేవించారు. లీప్ యాప్‌లో ఉదయం 9 గంటలలోపు హాజరు వేయాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పిల్లల హక్కులు కాపాడుదాం..

పాలకొండ రూరల్: పిల్లల హక్కులు కాపాడేందుకు రూపొందించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అప్‌హోల్డ్ ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా కోఆర్డినేటర్ బి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని 1, 2 వార్డుల్లో అంగన్‌వాడీ సిబ్బందితో శనివారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. బడి బయట పిల్లలను గుర్తించి వారిని బడిబాట పట్టించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఎస్.నిరుపమ, మహిళా సంరక్షణ అధికారి ప్రమీల, డ్వాక్రా సభ్యులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లల రక్షణ, హక్కులు కాపాడడంపై సూచనలు చేస్తున్న ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్

గోదాములను తరలించండి..

వీరఘట్టం: జనావాసాల మధ్య ఉన్న గోదాములను దూర ప్రాంతాలకు తరలించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ ఆదేశించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న ప్లాస్టిక్ సంచుల గోదాములో ఇటీవల అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా.. చుట్టుపక్కల వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ వెంకటరమణ శనివారం మండల కేంద్రంలో శనివారం పర్యటించి, జనావాసాల మధ్యన ఉన్న గోదాములను పరిశీలించారు. గోదాములు, స్క్రాప్ షాపులను దూరంగా తరలించాలని ఈఓ. బి.కోటేశ్వరరావును ఆదేశించారు. యూనియన్ బ్యాంక్ పక్కన నిర్మించిన జీ ప్లస్ 3 భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయో, లేదో పరిశీలించాలని ఈఓకు సూచించారు.

డ్రమ్ సీడర్‌తో తక్కువ కాలంలో ఎక్కువ పని

జియ్యమ్మవలస: మండలంలోని అలమండ పంచాయతీ, మరువాడ గ్రామంలో ఎర్ర సత్యనారాయణ వ్యవసాయ క్షేత్రంలో ఏవో విజయభారతి ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ సాయంతో వరి విత్తనాలు సహా నవధాన్యాలు వేయడంపై శనివారం అవగాహన కల్పించారు. అనంతరం డీపీఎం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాలు సాగు చేసుకుంటే నేల సారవంతం కావడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. తక్కువ పెట్టుబడి, శ్రమతో అధిక దిగుబడులు కావాలంటే డ్రమ్ సీడర్‌ను వినియోగించుకోవాలన్నారు. అనంతరం అల్లువాడ గ్రామంలో సర్పంచ్ బొంగు పరిశినాయుడు ఆధ్వర్యంలో దశపర్ని (పది రకాల ఆకులు, మూత్రం) కషాయం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ శ్రీరామ్, సీహెచ్ లక్ష్మణ్, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



మరువాడలో డ్రమ్ సీడర్ సాయంతో వరినాట్లు వేయిస్తున్న డీపీఎం శ్రావణ్‌కుమార్

త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయండి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎడ్యుకేషన్ చైర్మన్ రాజశేఖర్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని టేకరిగండ వద్ద నిర్మాణ దశలోని గిరిజన ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని రాష్ట్ర ఎడ్యుకేషన్ చైర్మన్ రాజశేఖర్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిలు శనివారం పరిశీలించారు. నిర్మాణ పనులు ఎంతవరకు జరిగాయి.. ఏ మేర నిధులు అవసరం అనే విషయాలను పనుల నిర్వాహకులను అడిగారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

సంప్రదాయబద్ధంగా శివయాత్ర

పాలకొండ రూరల్: హైందవ సంప్రదాయబద్ధంగా శివయాత్ర చేపట్టాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. మండలంలోని టీటీడీ పారాపురంలో శివయాత్ర కార్యక్రమం చేపట్టి.. ఆత్మ, పరమాత్మలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేదిక విజయనగరం కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com